## క్లుప్తంగా

### వేరుశనగ విత్తన పంపిణీకి పేర్ల నమోదు



సనపలో వేలిముద్ర వేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతు

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీకి పేర్ల నమోదు ప్రారంభమైంది. రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. విత్తనకాయలు కావాల్సిన రైతులు పట్టాదారు పుస్తకం, పాసుపుస్తకం, ఆధార్‌కార్డు,ఫోన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

### జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొనండి

అనంతపురం కల్చరల్: ఈనెల 21న శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కర్నూలులో జరగనున్న జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో అనంత వాసులు భాగస్వాములు కావాలని శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు కోరారు. రాయలసీమలో పెద్దఎత్తున కవులు, రచయితలను ప్రోత్సహించడానికి శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే కవులను ప్రశంసా పత్రంతో పాటు దుశ్శాలువతో సత్కరిస్తామన్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జరగనున్న కవిసమ్మేళనంలో సుప్రసిద్ధ సాహితీవేత్తలు, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

### లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీని శిక్షించాలి




గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ నాయకులు మంగళవారం టవర్ క్లాక్ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. కార్యక్రమం సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు శ్రీనివాసులు, వేణుగోపాల్, శివకృష్ణ, హరికృష్ణ, రామలక్ష్మి, హస్మత్‌బీ, తిమ్మక్క, కళావతి పాల్గొన్నారు.

### బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్

రాప్తాడురూరల్: బాల్య వివాహాలు అరికట్టేందుకు విస్తృత అవగాహన కల్పించాలని అనంతపురం ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం-4, 5 గ్రామ సచివాలయాల వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలను కట్టడి చేసే విషయంలో ఏదైనా ఇబ్బందులు తలెత్తినా ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో బ్యాంకు ఖాతా ఉన్న పేద ప్రజలను తప్పనిసరిగా పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాల్లో నమోదు చేయించాలన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రైవ్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి అశోక్ బాబు, సచివాలయ కార్యదర్శులు మహేంద్ర, బాలచంద్ర పాల్గొన్నారు.

### నాడు-నేడు పనులను పూర్తి చేయండి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థలో ఫేస్-2 పనులకు సంబంధించి పురోగతిపై కమిషనర్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పనుల జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి సందేహాలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ సతీష్ చంద్ర, ఈఈలు రామమోహన్ రెడ్డి, చంద్రశేఖర్, ఏఈ బాబావలి, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులకు వెళ్లి.. నెత్తిన కట్టెల మోపు ఎత్తుకొని ఇళ్లకు చేరుకుంటున్న కూలీలు



మధ్యాహ్న సమయంలో కలెక్టరేట్ వద్ద నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

సమ్మర్ కర్ఫ్యూ..

## అంతా నిర్మానుష్య‘మే’..

జిల్లా వ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. మేనెలలో మరింత ముదిరిపోయాయి. భానుడి భగభగలకు మాడు మాడుతోంది. 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో ఉక్కపోత అధికంగా ఉంది. వడగాల్పుల తీవ్రత పెరిగింది. ఎండవేడిమి తాళలేక అత్యవసర సమయాల్లో మినహా జనం వీధుల్లోకి రాలేకపోతున్నారు. వాహనాల్లో వెళ్లాలన్నా ఆలోచించే పరిస్థితి. వీధులన్నీ జనం లేక నిర్మానుష్యంగా మారాయి. తలకు రుమాలు చుట్టుకొని గానీ, కొంగు కప్పుకొనిగానీ వెళ్తున్నారు. చిరువ్యాపారాలు చేసుకునేవారు కూడా ఎండకు అల్లాడిపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి



చీరకొంగు కప్పుకొని వెళ్తున్న మహిళలు



కర్ఫ్యూ.. సుభాష్ రోడ్డులో ఇలా..



ఎండలోనే చేపలు అమ్ముకుంటున్న మహిళలు



ఎండవేడిమిని తాళలేక ఇక్కట్లు పడుతున్న వాహనదారులు

## ఉత్సాహంగా వేసవి శిక్షణ



శిక్షణ ఇస్తున్న మాస్టర్ కత్తి విజయ్‌కుమార్



డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారు

అనంతపురం కల్చరల్: స్థానిక కృష్ణకళా మందిరంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా ప్రారంభమైంది. ‘సాక్షి’ దినపత్రిక ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెండురోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. సీనియర్ ఆర్ట్, డాన్సు మాస్టర్ కత్తి విజయ్‌కుమార్ శిక్షణను ప్రారంభించి, అనేక మెలకువలు నేర్పించారు. తొలిరోజు కరాటే, వెస్ట్రన్ డాన్సు, చిత్రలేఖనంలో చిన్నారులు ఎంతో ఆసక్తికరంగా నేర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం దాకా వేసవి శిక్షణ శిబిరంలో సందడి చేస్తూ పలు విషయాలపై అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా కత్తి విజయ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి శిబిరాలలో చిన్నారులు వినోదంతో పాటు విజ్ఞానాన్ని నేర్చుకుంటారన్నారు. మండిపోతున్న ఎండల నుంచి రక్షణ కోసం నీడపాటున ఉండేలా తల్లిదండ్రులు చిన్నారులను ప్రోత్సహించాలని, ఆసక్తి ఉన్న విద్యార్థులు బుధవారం కూడా చేరవచ్చన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం: వేసవి క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం మేయర్ వసీం అన్నారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇందులో మొత్తం 1,526 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. నగరంలోని ఇండోర్ స్టేడియంలో శిక్షణ శిబిరాలకు క్రీడా సామగ్రి మంగళవారం అందించారు. కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతపురం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, 27వ డివిజన్ కార్పొరేట్ కార్పొరేటర్ రమణ, 29వ డివిజన్ కార్పొరేటర్ సైపుల్లాబేగ్, ఆన్‌సెట్ సీఈఓ కేశవ నాయుడు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ కే జగన్నాథ రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రటరీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బళ్లారి బైపాస్‌లో అల్లరి మూకల హల్‌చల్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని బళ్లారి చౌరస్తాలో అల్లరి మూకలు హల్‌చల్ చేశాయి. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో తప్పతాగి రెండు వర్గాలు భౌతిక దాడులకు దిగాయి. స్థానికులు, వ్యాపారులు భయాందోళనతో పరుగులు తీశారు. రాళ్లు తీసుకుని పరస్పరం దాడి చేసుకోవడంతో అవి తగులుతాయేమోనని వాహనదారులు, వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. కాగా కిటకిటలాడుతున్న 44వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై గంటకు పైగా అల్లరి మూకలు హల్‌చల్ చేసినా ఘటనా స్థలానికి పోలీసులు చేరుకోకపోవడం గమనార్హం. చివరికి అల్లరి మూకలు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా అల్లరి మూకల దాడిలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.

## పోలీసుల వేధింపులు ఆపాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ, భగత్ సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: ఆటో డ్రైవర్లపై పోలీసులు వేధింపులు ఆపాలని సీఐటీయూ, భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో నాయకులు, ఆటో డ్రైవర్లు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యావంతులైన యువత ఆటో నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. రోజు రోజుకూ పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరల పెరుగుతున్న క్రమంలో అరకొర సంపాదనతో కుటుంబాలను కష్టంగా నెట్టుకొస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసులు ఈ-చలానా పేరుతో జరిమానాలు విధిస్తూ కోర్టు పంపుతున్నారన్నారు. పార్కింగ్ స్థలంలో ఆటోలు నిలిపి ఉంచితే, డ్రైవర్లపై పోలీసులు దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం డీఆర్ఓ గాయత్రిదేవికి నాయకులు వినతిపత్రం అందించాశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, ముర్తుజా, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు నాగరాజు, శ్రీనివాసులు, ఆదినారాయణ, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

### చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఆంధ్రప్రదేశ్, అనంతపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన బాలబాలికల ఓపెన్ చెస్ టోర్నీలో మాంటెస్సోరీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం ఆ పాఠశాలలో నిర్వహించిన అండర్-14 విభాగంలో హిమోష అనే విద్యార్థి 9 రౌండ్లకు కాను 5 రౌండ్లలో విజయ సాధించి గుంతకల్లు బెస్ట్ ప్లేయర్ ట్రోఫీతో పాటు మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. అండర్-11 విభాగంలో జాన్వీ అత్యధిక పాయింట్స్ సాధించినట్లు అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు.

## విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఆత్మకూరులో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



రాప్తాడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: ఆరోగ్య విషయాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి దయాకర్ తెలిపారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి వైద్య సిబ్బంది ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ చంద్రావతి, ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, మునాఫ్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, డెంగీపై అప్రమత్తత అవసరమని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు శ్రావణి, శివకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రాప్తాడులోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో డెంగీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా




ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయికులు

రాప్తాడురూరల్: నగరంలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఓ) కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఈ కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏఐఎస్బీ జిల్లా కార్యదర్శి పృథ్వీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్, ఏఐఎస్ఏ నాయకులు పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహించరాదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా కొన్ని సంస్థలు అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్న అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఉమామహేష్, ఆనంద్, విష్ణు జగదీష్ రాజేష్, ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ చంద్ర, రాజేష్, ముస్తఫా, ఏఐఎస్బీ మారుతి, నరేష్, అజయ్, నాగార్జున, బీసీ, ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సమైక్య చంద్ర, సాయి ఏఐఎస్ఏ నితీష్ పాల్గొన్నారు.

## తాడిపత్రి కానిస్టేబుళ్లకు ఎస్పీ ప్రశంస

తాడిపత్రి అర్బన్: విధి నిర్వహణ ఉత్తమ ప్రతిభను కనబరచిన తాడిపత్రికి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ కే. శ్రీనివాసరావు అభినందించారు. పట్టణంలోని సంజీవనగర్ రెండో రోడ్డులో ఇటీవల వారం కిందట విశ్రాంత తహసీల్దార్ శ్రీనివాసరావు ఇంటిలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ చోరీలో రూ.5 లక్షల విలువ చేసే బంగారు నగలు చోరీకి గురైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల తాడిపత్రికి చెందిన కానిస్టేబుళ్లు భాస్కర్, రిజ్వాన్‌వలి చాకచక్యంగా కేసును ఛేదించి చోరీ సొత్తు రకవరీ చేసిన విషయం తెలిసిందే. ఇందుకుగాను మంగళవారం జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు తన కార్యాలయానికి పిలిపించుకుని అవార్డులు ప్రదానం చేసి అభినందించారు. డీఎస్పీ గంగయ్య పాల్గొన్నారు.

### వ్యక్తిత్వ వికాసంతోనే ఉన్నత స్థాయి

అనంతపురం కల్చరల్: ప్రతి విద్యార్థీ వ్యక్తిత్వ వికాసంతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా యువజన సంక్షేమ శాఖ, నెహ్రూ యువకేంద్ర, యువమిత్ర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సాయిబాబా జాతీయ కళాశాలలో ‘ కెరీర్ గైడెన్స్-వ్యక్తిత్వ వికాసం’ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌సెట్ సీఈవో కేశవనాయుడు, నెహ్రూ యువకేంద్ర డీడీవో శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర రాజు, సెక్రటరీ డాక్టర్ నిర్మలమ్మ, యువజన సంక్షేమశాఖ మేనేజర్ సునీల్‌కుమార్‌రెడ్డి, యువమిత్ర సంస్థ వ్యవస్థాపకులు మోహన్‌రెడ్డి ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. ఐడియా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు షరీఫ్ వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు వివరించారు. అంతకు ముందు ‘విద్య-ఉద్యోగ కరదీపిక’ బుక్‌లెట్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచార్య, దేవికామణి, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### విధుల్లోకి ఉద్యానశాఖ జిల్లా అధికారి

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యానశాఖ జిల్లా అధికారి (డీహెచ్‌వో) బి.రఘునాథరెడ్డి మంగళవారం విధుల్లోకి చేరారు. వ్యక్తిగత పనుల నిమిత్తం గత నెల 30 నుంచి 16 రోజులు సెలవు పెట్టారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్‌గా ఏడీ బీఎంవీ నరసింహారావు వ్యవహరించారు.

### బస్టాండ్ అభివృద్ధికి చర్యలు

- ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల పేర్కొన్నారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండ్ నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా.. సదరు కాంట్రాక్టర్‌తో పని చేయించడంలో నిర్లక్ష్యం సరికాదని ఆమె అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. బస్టాండ్ ఆవరణ కూడా అపరిశుభ్రంగా ఉంటోందని మండిపట్టారు. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే బస్టాండ్ ఆవరణలో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ మూర్తి, సూపరింటెండెంట్ శ్రీపాద తదితరులు పాల్గొన్నారు.

### లోయలో పడిన కారు.. విద్యార్థి మృతి

పెనుకొండ రూరల్ : ఇంటర్ అడ్మిషన్ కోసం బెంగళూరు వెళ్లి తిరిగి వస్తున్న విద్యార్థి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఇదే ప్రమాదంలో ఇతడి తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు.

వివరాల్లోకి వెళితే.. అనంతపురం సిండికేట్ నగర్‌కు చెందిన ఈశ్వరయ్య, కృష్ణవేణి దంపతుల కుమారుడు చరణ్‌తేజ్ (15) ఇటీవలే వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణుడయ్యాడు. చరణ్‌తేజ్‌ను బెంగళూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివించాలని తల్లిదండ్రులు భావించారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం ఈశ్వరయ్య దంపతులు కుమారుడు చరణ్‌తో కలిసి కారులో బెంగళూరు వెళ్లారు. కళాశాలలో పని చూసుకుని సాయంత్రం అనంతపురానికి తిరుగు పయనమయ్యారు. వీరి వాహనం రాత్రి 11 గంటల సమయంలో పెనుకొండ హరిపురం వై జంక్షన్ సమీపంలోకి రాగానే సిమెంట్ దిమ్మెను ఢీకొంది. దాదాపుగా 10 అడుగులో లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్ సీట్ పక్కన కూర్చున్న చరణ్ తేజ్ (15) తలకి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ఘటనలో ఈశ్వరయ్య, కృష్ణవేణిలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు. పెనుకొండ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

### ప్రత్యేక నిధులతో కాలువల నిర్మాణం

అనంతపురం క్రైం: స్పెషల్ గ్రాంట్ కింద రూ.70 లక్షల మంజూరైందని, ఆ నిధులతో కాలువలు నిర్మించనున్నట్లు మేయర్ వసీం తెలిపారు. మంగళవారం నగరంలోని 38వ డివిజన్‌లోని మేయర్ పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. లక్ష్మీనగర్‌లోనూ రూ.1.40 కోట్లతో బీటీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో స్థానికులు విద్యుత్ స్తంభాల సమస్యలు తీసుకురావడంతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో పది స్తంభాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

### రేపు బహిరంగ వేలం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లోని ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను ఈనెల 18న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ విజయభాస్కర్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

# సాక్షి
## అనంతపురం

బుధవారం। 17। మే। 2023






**టన్ను చీనీ రూ.36 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయల ధర గరిష్టంగా రూ.36 వేలు పలికింది.



**పరారీలో డాక్టర్ లక్ష్మీకాంతమ్మ**

అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో భ్రూణహత్యకు కారకురాలైన డాక్టర్ లక్ష్మీకాంతమ్మ పరారీలో ఉన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
41.7°/ 25.4°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. వడగాల్పుల తీవ్రత పెరిగింది.

## న్యూస్‌రీల్

### ఈతకెళ్లి బాలుడి మృతి



ప్రభాస్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

**కంబదూరు:** ఈత నేర్చుకునేందుకని బావిలోకి దూకిన బాలుడు నీట మునిగి మృతి చెందాడు. మర్రిమాకులపల్లిలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని తిప్పగానపల్లికి చెందిన బోయ భాస్కర్, కవిత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు ప్రభాస్(10)ను కవిత కంబదూరు మండలం మర్రిమాకులపల్లిలోని తన తల్లిదండ్రులు రామకృష్ణ, కరియమ్మల వద్ద వదిలింది. ప్రభాస్ ఇక్కడే నాలుగో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు రావడంతో ఇటీవల తల్లిదండ్రులు, తమ్ముడు హర్షిత్ మర్రిమాకులపల్లికి వచ్చారు. మంగళవారం ప్రభాస్ తన తమ్ముడు హర్షిత్‌తో కలిసి ఈత నేర్చుకునేందుకని మర్రిమాకులపల్లి–కొత్తూరు మధ్యన గల బావి వద్దకెళ్లారు. ఈత కొట్టేందుకని బావిలోకి దూకిన ప్రభాస్ ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో తమ్ముడు పరుగెత్తుకుంటూ గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. వెంటనే తల్లిదండ్రులు వెళ్లి చూడగా అప్పటికే ప్రభాస్ విగతజీవిగా నీటిలో తేలియాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని బయటకు తీసి విలపించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### గుంతకల్లు–మంత్రాలయం రోడ్డు మధ్య ప్రత్యేక రైళ్లు



**గుంతకల్లు:** భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని గుంతకల్లు – మంత్రాలయం రోడ్డు మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 31 వరకు గుంతకల్లు జంక్షన్ (07187) నుంచి సాయంత్రం 5.40 గంటలకు బయలుదేరి రాత్రి 7.30 గంటలకు మంత్రాయం రోడ్డు రైల్వేస్టేషన్‌కు చేరుతుంది. ఇక తిరుగు ప్రయాణంలో ఈ నెల 19 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు మంత్రాలయం రోడ్డు రైల్వేస్టేషన్ (07188) నుంచి తెల్లవారుజామున 4.40 గంటలకు బయలుదేరి గుంతకల్లు జంక్షన్‌కు ఉదయం 6.20 గంటలకు చేరుతుంది.

### పెరగనున్న ఉష్ణోగ్రతలు



**బుక్కరాయసముద్రం:** జిల్లాలో ఎండలు మండుతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయి. ఈ మేరకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 39.3–40.1, రాత్రి ఉష్ణోగ్రతలు 26.5–27.2 మధ్య డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చని తెలిపారు. గాలిలో తేమ శాతం ఉదయం 65–70, మధ్యాహ్నం 30–33గా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

### ప్రశాంతంగా ఏపీఈఏపీసెట్



ఎస్‌ఆర్‌ఐటీ పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాట్లపై పరిశీలిస్తున్న ఈఏపీసెట్ చైర్మన్ రంగజనార్దన

**అనంతపురం:** ఏపీ ఈఏపీసెట్ రెండో రోజూ మంగళవారం ప్రశాంతంగా సాగింది. అనంతపురం జిల్లాలో ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో మూడు సెషన్లకు కలిపి మొత్తం 4,816 మంది పరీక్ష రాశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో 506 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఏపీ ఈఏపీసెట్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ సి.శోభాబిందు తెలిపారు. ఎస్‌ఆర్‌ఐటీ పరీక్ష కేంద్రాన్ని ఏపీఈఏపీసెట్ చైర్మన్ జింకా రంగజనార్దన పరిశీలించారు.



- డబ్బు కోసం భ్రూణహత్యలు
- డయాగ్నస్టిక్ సెంటర్లలో గుట్టుగా లింగ నిర్ధారణ
- రేడియాలజిస్ట్‌లు, గైనకాలజిస్ట్‌లు కుమ్మక్కై పరీక్షలు
- లింగనిర్ధారణతో భారీగా పెరుగుతున్న అబార్షన్లు
- అబార్షన్ వికటించి తాజాగా ఇద్దరు తల్లుల మృతి
- అమ్మాయిల సంఖ్యలో వెనుకబడిన ఉమ్మడి జిల్లా

అమ్మాయి పుడితే ఒక రకం, అబ్బాయి పుడితే మరోరకంగా చూస్తోంది ఈ లోకం. అమ్మా–నాన్నలకు, చిన్నవారికి–పెద్దవారికి, ఇలా ప్రతి ఒక్కరికీ అమ్మాయి తలలో నాలుకలా ఉంటుంది, చేదోడువాడుగా నిలుస్తుంది. త్యాగానికి ప్రతీక అమ్మాయి జీవితం. అలాంటి అమ్మాయిని మొగ్గలోనే తుంచేయడం ఎంత వరకు సబబు...? అమ్మాయిలు ఇంటికి దీపం లాంటివారు. వారికీ జీవించే అధికారం ఉంది. వారు కాబోయే తల్లులు.. మరి ఆ చిట్టి తల్లులను హత్య చేసే అధికారం ఎవరిచ్చారు..?

# చిదిమేస్తున్నారు!

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో భ్రూణ హత్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఓవైపు సామాజిక మాధ్యమాలతో పాటు టీవీల్లో సైతం అమ్మాయి పుడితే లక్ష్మీదేవి ఇంటికొచ్చినట్టేనన్న ప్రకటనలు చూస్తున్నాం. వాస్తవానికి అమ్మాయి అని తెలియగానే కడుపులోనే బిడ్డను చిదిమేస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు కళ్లెం వేసేందుకు పటిష్టమైన చట్టం పీసీపీఎన్‌డీటీ (ప్రి కన్సెప్షన్ అండ్ ప్రినేటల్ డయాగ్నస్టిక్స్ టెక్నిక్స్) ఉన్నా సరిగా అమలు కావడం లేదు. దీంతో గుట్టు చప్పుడు కాకుండా భ్రూణహత్యలు జరుగుతున్నాయి.

**చట్టం కఠినంగా ఉన్నా**

రాష్ట్రంలో రేడియో డయాగ్నస్టిక్స్ సెంటర్లలో యథేచ్ఛగా లింగనిర్ధారణ జరుగుతోంది. స్వయానా ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే వైద్యురాలే లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిసినా చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది. చట్టం కఠినంగా ఉన్నా అమలు సరిగా లేనికారణంగా కొన్ని ప్రైవేటు డయాగ్నస్టిక్స్ సెంటర్లు ఏ మాత్రమూ భయపడకుండా వ్యాపారం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏటా 65వేల మందికి పైగా గర్భం దాలుస్తుండగా.. అందులో ఎనిమిది వేల వరకూ అబార్షన్‌లు జరుగుతున్నట్టు అంచనా.

**బిడ్డ అడ్డం తిరిగిందని..ఎదుగుదల లేదని..**

అబార్షన్లు చేయడంలో కూడా కొంతమంది వైద్యులు ఆరితేరిపోయారు. ముఖ్యంగా లింగనిర్ధారణ కోసం స్కానింగ్ చేసి.. బిడ్డ ఎదుగుదల సరిగా లేదని, దీని వల్ల పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అబార్షన్ చేస్తే మంచిదని సూచిస్తారు. ముందే ఒప్పందం ప్రకారం ఆ గర్భిణి ఫలానా గైనకాలజిస్ట్ వద్దకు వెళుతుంది. ఆ రిపోర్టు చూడగానే అబార్షన్‌కు ఏర్పాటు చేస్తుంది. ఈ మొత్తం వ్యవహారం రూ.15వేల నుంచి రూ.20వేల ప్యాకేజీతో చేస్తున్నారు.

**నిర్లక్ష్యానికి నిదర్శనాలివే..**

అబార్షన్లు, కాన్పులు ఎంత నిర్లక్ష్యంగా చేస్తున్నారనే దానికి తాజా ఘటనలే ఉదాహరణ. అనంతపురంలో ఆర్వేటి నగర్‌కు చెందిన సనం సుల్తానా పురిటినొప్పులతో రాగా డాక్టర్ల నిర్లక్ష్యంగా కారణంగా బాలాజీ నర్సింగ్ హోంలో తల్లీ బిడ్డ ఇద్దరూ మృతి చెందారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన కవిత అనంతపురంలోని రూత్ నర్సింగ్‌హోంకు రాగా.. ఈమెకు ఇక్కడే లింగనిర్ధారణ పరీక్షలు చేసినట్టు వెల్లడైంది. పుట్టబోయేది ఆడపిల్ల అని నిర్ధారించుకున్నాక అబార్షన్ చేశారు. ఆ తర్వాత పరిస్థితి విషమించి బాధితురాలు మృతిచెందింది. అబార్షను చేసిన డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అనంతపురం సర్వజనాసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండటం గమనార్హం. ఇలా లింగనిర్ధారణ, అబార్షన్‌ల కారణంగా అనంతపురంలో ఆడపిల్లల సంఖ్య ఏటికేటికీ తగ్గిపోతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని భ్రూణహత్యలకు అడ్డుకట్ట వేసి.. అమ్మాయిలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**గ్రేటర్ రాయలసీమ జిల్లాల్లో గడిచిన మూడు దశాబ్దాల్లో 1000 మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య ఇలా..**

| జిల్లా | 1991 సెన్సెస్ | 2001 సెన్సెస్ | 2011 సెన్సెస్ |
|---|---|---|---|
| వైఎస్సార్ | 968 | 951 | 919 |
| అనంతపురం | 963 | 959 | 927 |
| చిత్తూరు | 970 | 955 | 931 |
| ప్రకాశం | 969 | 955 | 932 |
| కర్నూలు | 955 | 958 | 937 |
| నెల్లూరు | 937 | 954 | 945 |

**ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు ఇలా**

| | |
|---|---|
| పాలీ క్లినిక్‌లు | 6 |
| 20 బెడ్‌లలోపు ఆస్పత్రులు | 111 |
| 50 బెడ్‌లలోపు ఆస్పత్రులు | 31 |
| 100 బెడ్‌లలోపు ఆస్పత్రులు | 15 |
| 200 బెడ్‌లలోపు ఆస్పత్రులు | 4 |
| డయాగ్నస్టిక్ సెంటర్లు | 81 |
| హై ఎండ్ డయాగ్నస్టిక్ సెంటర్లు | 6 |

**డయాగ్నస్టిక్ సెంటర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు?**

- లింగ నిర్ధారణ జరిగినట్టు తేలితే మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా
- వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టరు రిజిస్ట్రేషన్ రద్దు లేదా సస్పెండ్ చేయొచ్చు
- లింగ నిర్ధారణ చేశారని తెలిసి, అబార్షన్ చేసిన గైనకాలజిస్ట్‌కు బెయిలు లేని మూడేళ్ల జైలు
- డయాగ్నస్టిక్ సెంటర్‌ను మూసేయడంతో పాటు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తారు
- బాధ్యులైన వైద్యులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు


**కఠిన చర్యలు తీసుకుంటాం**



అనంతపురంలో సోమవారం అబార్షన్ వికటించి జరిగిన మాతృమరణం కలచివేసింది. ఈ ఘటనపై ప్రత్యేక బృందాలకు విచారణ బాధ్యతలు అప్పజెప్పాం. బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. లింగనిర్ధారణ అమానుష చర్య.

–డా.వీరబ్బాయి, జిల్లా వైద్యాధికారి

### విత్తన కందులు, పెసలుపై 30 శాతం రాయితీ





**అనంతపురం అగ్రికల్చర్:** ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేరుశనగపై 40 శాతం రాయితీ ప్రకటించిన సర్కారు... కందులు, పెసలుపై 30 శాతం రాయితీ వర్తింపజేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు జనరల్ సీడ్ కింద 4,300 క్వింటాళ్ల కందులు కేటాయించారు. అందులో ఎల్ఆర్‌జీ–41 రకం 1,150 క్వింటాళ్లు, ఎల్ఆర్‌జీ–52 రకం 2,350 క్వింటాళ్లు ఉన్నాయి. వీటిని మండలాల వారీగా అలాట్ చేశారు. ఉరవకొండ సబ్ డివిజన్‌కు అత్యధికంగా 1,200 క్వింటాళ్లు, అనంతపురం డివిజన్‌కు 850 క్వింటాళ్లు, కళ్యాణదుర్గం డివిజన్‌కు 825 క్వింటాళ్లు, గుత్తి డివిజన్‌కు 600 క్వింటాళ్లు, రాయదుర్గం డివిజన్‌కు 525 క్వింటాళ్లు, తాడిపత్రి డివిజన్‌కు 300 క్వింటాళ్లు కేటాయించారు. అలాగే 179 క్వింటాళ్లు పెసర విత్తనాలు ఇచ్చారు. ఇవి కాకుండా మినీ కిట్ల రూపంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో రైతులకు కందులు ఇవ్వనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

**ధరలు ఎంతంటే...**

కందులు ఎల్ఆర్‌జీ 41, 52 రకాలు 4 కిలోల ప్యాకెట్ల రూపంలో ఇవ్వనున్నారు. 4 కిలోల ప్యాకెట్ పూర్తి ధర రూ.445.60 కాగా అందులో 30 శాతం రాయితీ రూ.133.68 పోనూ మిగతాది అంటే రూ.311.92 ప్రకారం రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఐపీఎం 2–14 రకం పెసలు 4 కిలోల ప్యాకెట్ పూర్తి ధర రూ.470 కాగా.. అందులో 30 శాతం రాయితీ రూ.141 పోనూ రైతులు తమ వాటా కింద రూ.329 ప్రకారం చెల్లించాలి. వేరుశనగతో పాటు కందులు, పెసలు, అలాగే జనుము, జీలుగ లాంటి పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో తమ వాటా సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. కే–6 రకం విత్తన వేరుశనగ 30 కిలోల బస్తా ధర రాయితీ పోనూ రూ.1,674 ప్రకారం, అలాగే 1812 రకం 30 కిలోల బస్తా ధర రూ.1,494 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విత్తన రిజిస్ట్రేషన్లు మంగళవారం ప్రారంభమైనందున రైతులు వినియోగించుకోవాలని కోరుతున్నారు.

# దొంగలెవరో తేల్చాల్సిందే

- వ్యవసాయ పరికరాలు అమ్ముకున్నదెవరు?
- జిల్లా అధికారిని నిలదీసిన జెడ్పీటీసీ సభ్యులు
- వాడీవేడిగా సాగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



వాగ్వాదానికి దిగిన డీఏఓ చంద్రానాయక్, సభ్యులు రాధాస్వామి, భూతరాజ్‌లకు సర్దిచెబుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

**అనంతపురం సిటీ:** గత ప్రభుత్వంలో రైతులకు సరఫరా చేసిన రెయిన్ గన్లు, ఇతర వ్యవసాయ పరికరాలను రికవరీ చేసి.. కర్ణాటకలో అమ్ముకున్న దొంగలెవరో తేల్చాల్సిందేనని జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు పట్టుబట్టారు. పొంతనలేని సమాధానాలిచ్చిన జిల్లా వ్యవసాయాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగలెవరో జాబితా తమకు అందిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో జరిగిన స్థాయీ సంఘ సమావేశాలు వాడీవేడిగా సాగాయి. తొలుత స్థాయీ సంఘం సమావేశం –3 (వ్యవసాయ, అనుబంధ శాఖలు) పరిగి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామప్ప అధ్యక్షతన జరిగింది. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ హాజరయ్యారు. తొలుత జెడ్పీ సీఈఓ చర్చను ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ తమ శాఖ ప్రగతి గురించి నివేదిక చదివి వినిపించే ప్రయత్నం చేయగా.. సభ్యులు అడ్డుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట రుణాల గురించి వివరించాలని కోరారు. అంతకంటే ముందు గత ప్రభుత్వం ఇచ్చిన రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్లు వంటి వ్యవసాయ పరికరాలు రైతుల నుంచి ఏటలు రికవరీ చేశారని, అయితే వాటిని తిరిగి రైతులకు ఇవ్వకుండా కర్ణాటకలో కొందరు సరిహద్దు మండలాల అధికారులు అమ్ముకున్నారని ఆరోపించారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని సభ్యులు రాధస్వామి(కుందుర్పి), భూతరాజ్ (గుడిబండ), శ్రీనివాసరెడ్డి (లేపాక్షి), డాక్టర్ బాషా (గోరంట్ల) డిమాండ్ చేశారు. పరికరాలు అమ్ముకున్న వారి జాబితా ప్రభుత్వానికి పంపామని, తదుపరి ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామని డీఏఓ చెప్పగా.. సభ్యులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అన్నీ అబద్ధాలు చెబుతున్నారంటూ వాగ్వాదానికి దిగడంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. జెడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. ఏఓలపై చర్యల కోసం ఉన్నతాధికారులకు పంపిన నివేదికను ఇక్కడ చదివి వినిపించాలని డీఏఓను కోరారు. ఇందుకు ఆయన సమాధానం దాటవేసేందుకు ప్రయత్నించడంతో సభ్యులు మరింత ఆగ్రహంతో ఊగిపోయారు. ఎన్ని రోజుల్లోగా చర్యలు తీసుకుంటారో సభ్యులకు సమాధానం చెప్పాలని చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆదేశించగా.. 15 రోజుల్లోగా చర్యలు తీసుకుంటామని డీఏఓ హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

- అంతకు ముందు చిరు ధాన్యాల సాగుపై ఆర్‌బీకేల్లో సదస్సులు నిర్వహించాలని, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు తమ వంతు సహకారం అందిస్తామని సభ్యులు హామీ ఇచ్చారు. వ్యవసాయ బోరుబావులు తవ్వకోవడానికి తమ మండలంలోని గ్రామాలకు 'వాల్టా' నుంచి మినహాయింపు ఇవ్వాలని లేపాక్షి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి భూగర్భ జల వనరుల అధికారులను కోరారు.

**అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం**

స్థాయీ సంఘం–1, 7 (ప్రణాళిక, ఆర్థిక/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షత వహించారు. శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి గైర్హాజరు కావడంపై చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులకు మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు రాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని సభ్యులు శ్రీరాములు (పెనుకొండ), భూతరాజ్(గుడిబండ) ఆవేదన వ్యక్తం చేశారు. మండలాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని సభ్యులు శ్రీరామప్ప(పరిగి), శ్రీనివాసరెడ్డి(లేపాక్షి) ఆరోపించారు. ప్రొటోకాల్ పాటించని అధికారులను ఉపేక్షించి లేదని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు.

- ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించిన చర్చ ప్రారంభంలో వేసవి సీజన్‌కు ముందే ప్రణాళిక రూపొందించుకోవాలనే విషయం తెలియదా అంటూ రెండు జిల్లాల ఎస్ఈలను చైర్‌పర్సన్ గిరిజమ్మ ప్రశ్నించారు. ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందో గుర్తించి, అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.
- ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, రోడ్లకిరువైపులా కంపచెట్లు పెరిగి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు.
- సచివాలయ ఉద్యోగుల పని తీరు ఇప్పటికీ మారడం లేదని, సచివాలయాలకు వచ్చే ప్రజలను గానీ, ప్రజాప్రతినిధులను గానీ వారు పట్టించుకోవడం లేదని సభ్యులతో పాటు చైర్‌పర్సన్ డీపీఓ ప్రభాకర్‌రావు దృష్టికి తెచ్చారు.

**నేటి స్థాయీసంఘం సమావేశాలు ఇలా..**

ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘం – 2, 4, 5, 6 (గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్యం /స్త్రీ, శిశు సంక్షేమం /సాంఘి సంక్షేమ శాఖలు) సమావేశాలు జెడ్పీ సమావేశ ప్రధాన భవన్‌తో పాటు అదనపు సమావేశ భవనాల్లో నిర్వహించనున్నట్లు జెడ్పీ వర్గాలు తెలిపాయి.

# రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

**అనంతపురం అర్బన్:** రైతు సంక్షేమం లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత బీమా, పంట రుణాలు, యంత్రసేవ పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు రైతు భరోసా కేంద్రం ద్వారా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బీకే భవనాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ–పంట నమోదు పక్కాగా జరగాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు కృషి

- శాంతిభద్రతల పరిరక్షణకు సమష్టిగా పనిచేద్దాం
- నేర సమీక్షలో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు



నేరసమీక్షలో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** నేరాల నియంత్రణకు కృషి చేయాలని డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి, ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లాలోని ఎస్ఐ, ఆపైస్థాయి పోలీసు అధికారులతో డీఐజీ, ఎస్పీలు నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యతనివ్వాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే పిటిషనర్ల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. గ్రేవ్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలుండాలన్నారు. మహిళలపై నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు ప్రయోగించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక ప్రాంతాల్లో చిన్న సమస్యలు సైతం తలెత్తకుండా అప్రమత్తంగా పని చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలని సూచించారు. స్థల వివాదాల విషయంలో పోలీసు పరిధి ఎంత వరకు ఉందో అంతవరకు మాత్రమే చూడాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగులకు తావుండకూడదని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సమష్టిగా పని చేయాలన్నారు. 'స్పందన' అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు ఆంథోనప్ప, సీఎం గంగయ్య, నరసింగప్ప, బి.శ్రీనివాసులు, జి.ప్రసాదరెడ్డి, బి.వి.శివారెడ్డి, శ్రీనివాసులు (ఏఆర్), సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# బోధనాస్పత్రికి మహర్దశ



వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మైక్రో బయాలజీ విభాగం వైద్యులు

- మైక్రో బయాలజీ విభాగానికి మరో 7 పీజీ సీట్లు మంజూరు

**అనంతపురం క్రైం:** రాష్ట్ర ప్రభుత్వ విప్లవాత్మక చర్యలతో అనంతపురం బోధనాస్పత్రికి మహర్దశ పట్టింది. మైక్రో బయాలజీ విభాగానికి మరో 7 పీజీ సీట్లు మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మైక్రో బయాలజీ విభాగంలో పీజీ సీట్ల సంఖ్య 11కు చేరింది. రానున్న మూడేళ్లలో 33 మంది పీజీ విద్యార్థులు ప్రజలకు వైద్య సేవలందించనున్నారు. రాష్ట్రంలో ఏ కళాశాల మైక్రో బయాలజీ విభాగంలోనూ ఈ స్థాయిలో పీజీ సీట్లు లేవు. దీంతో బోధానాస్పత్రి వైద్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

**ఏడాదికి 78 పీజీలు**

ప్రస్తుతం బోధానస్పత్రి(అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల)లో పీజీ సీట్ల సంఖ్య 78కి చేరింది. ఫార్మకాలజీ 2, మైక్రోబయాలజీ 11, ఫోరెన్సిక్ 2, జనరల్ మెడిసిన్ 5, ఆర్థోపెడిక్ 3, ఓబీజీ 12, బయో కెమిస్ట్రీ 2, ఎస్‌పీఎం 3, పెథాలజీ 4, జనరల్ సర్జరీ 8, పీడియాట్రిక్స్ 4, ఈఎన్‌టీ 3, ఆప్తమాలజీ 3, ఫిజియాలజీ 4, సైకియార్టీ 2, డర్మటాలజీ 4, అనస్తీషియా 6 సీట్లున్నాయి. ఈ లెక్కన మూడేళ్లలో 234 మంది పీజీ వైద్యులు వివిధ విభాగాల్లో సేవలందిస్తారు.

**నూతన ఆవిష్కరణలకు ఆస్కారం**

పీజీ సీట్ల పెంపుతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందించడంతో పాటు వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం మైక్రో బయాలజీ విభాగానికి పీజీ సీట్లు మంజూరు కావడంతో ఆ విభాగం వైద్యులు ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్ఛం అందించి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఆర్ హైమావతి, డాక్టర్ వేముల సరోజ, డాక్టర్ శైలజ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రత్నహారిక, ట్యూటర్లు డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, డాక్టర్ లలిత భవాని, డాక్టర్ దివ్య, పీజీలు డాక్టర్ ఎల్లం నాయుడు, డాక్టర్ డైసీ, డాక్టర్ అభినయ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### యువకుడి ఆత్మహత్య


మృతుడు విజయ్

పామిడి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బకు చెందిన శ్రీరాములు కుమారుడు విజయ్ (22) బతుకు తెరువు కోసం పామిడికి వలస వచ్చి, బైపాస్‌లోని ఆర్కే టీ కేఫ్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ముదిగుబ్బలోని తన తల్లితో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం నేరుగా టీ కేఫ్‌కు సమీపంలో తాను అద్దెకు ఉంటున్న గదికి చేరుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా, విజయ్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం క్రైం: డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినాన్ని పురస్కరించుకొని మంగళవారం నగర పాలక సంస్థలో కీటక జనిత వ్యాధి నియంత్రణపై సిబ్బందికి కమిషనర్ రమణారెడ్డితో కలసి డీఎంహెచ్‌ఓ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా డెంగీ నివారణ సాధ్యపడుతుందని డీఎంహెచ్‌ఓ అన్నారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ క్లాప్ ద్వారా చెత్తను పక్కాగా తరలించాలన్నారు. రోడ్డుపై చెత్త కన్పించకూడదన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మహిళా పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, ఐసీడీఎస్ పీడీ, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతతో పనిచేయండి

- వైద్యాధికారులకు ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సూచన
- పీజీ, హౌస్‌సర్జన్లకు పూర్తి బాధ్యత అప్పగించరాదని హితవు
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : కలెక్టర్


ఆస్పత్రికి అభివృద్ధికి చేసిన ప్రతిపాదనలను కలెక్టర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం క్రైం: సమాజంలో వైద్య వృత్తి ఎంతో గొప్పదని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని విధుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాలని బోధనాస్పత్రి వైద్యులకు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సూచించారు. పీజీ, హౌస్‌సర్జన్లకు పూర్తి బాధ్యతలు అప్పగించి 12.30 గంటలకే ఇళ్లకు డాక్టర్లు వెళ్లిపోతుండడాన్ని తప్పుబట్టారు. బోధనాస్పత్రి స్థితిగతులు, అందుతున్న సేవలు, వైద్యుల అవసరాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఇక్కడ అవకాశం కల్పించామని, అందుకు తగినట్లుగా మరింత బాధ్యతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కలెక్టర్ గౌతమి అధ్యక్షతన మంగళవారం జరిగిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓపీ సేవల్లో కనీసం గంట పాటు హెచ్‌ఓడీల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. బ్లడ్ బ్యాంకు, ల్యాబ్‌లలో విద్యార్థులతో రక్తనమూనాలు సేకరించడం సరికాదని, వారిని శిక్షణకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. అజెండాలోని అంశాలను సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ ప్రస్తావించారు.

### ఆరోగ్య శ్రీ కేసులు పెరగాలి

ఆరోగ్యశ్రీ కేసులు పెంచడం ద్వారా ఆస్పత్రికి ఆదాయం సమకూరుతుందన్న హెచ్‌డీఎస్ సభ్యుడు డాక్టర్ వైవీ మల్లారెడ్డి సూచనకు ఎమ్మెల్యే అనంత సానుకూలంగా స్పందించారు. మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్న బోధనాస్పత్రిలో ఆరోగ్య శ్రీ కేసుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పరిధిలో గైనిక్ కేసులు తక్కువగా నమోదవుతుండడంపై హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్ బేగంను నిలదీశారు. అయితే గర్భిణులు తీసుకువస్తున్న రేషన్ కార్డుల్లో సరైన వివరాలు ఉండకపోవడమే ఇందుకు కారణంగా ఆమె వివరణ ఇచ్చారు. అక్యూట్ మెడికల్ కేర్(ఏఎంసీ), క్యాజువాలిటీ(ఎమర్జెన్సీ)లో పడకల సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే అనంత పేర్కొన్నారు. అలాగే సర్జికల్ బ్లాక్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

### నిర్లక్ష్యం వీడాలి

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్‌ఓడీలను కలెక్టర్ గౌతమి హెచ్చరించారు. కచ్చితంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతి ఒక్కరూ విధుల్లో ఉండేలా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్‌ను ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పూర్తి స్థాయిలో పేదలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. అనంతరం అజెండాలోని 20 అంశాలకు గాను 12 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణవేణి, సూపర్ స్పెషాలిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, జీజీహెచ్ డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ వైవీ రావు ఏపీఎంఎస్ ఐడీసీ ఈఈ మునిచంద్రారెడ్డి, హెచ్‌డీఎస్ సభ్యులు నార్పల సత్యనారాయణరెడ్డి, తరిమెల అమరనాథరెడ్డి, సర్వజనాస్పత్రి హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

#### సమావేశంలో సభ్యులు ఆమోదించిన అంశాలు

- ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ సేవలను రుషి వెంకటేశ్వర ఏజెన్సీ కొనసాగించడం.
- ఓపీ, ఐపీ కేసుల రిజిస్ట్రేషన్‌ను టెండర్‌కు ఆహ్వానం.
- ఈ ఏడాది డిసెంబర్ వరకూ కంప్యూటర్ నిర్వహణను షాబాద్ కంప్యూటర్స్ కొనసాగించేలా చర్యలు.
- జేఎస్‌కే సర్వీసులను సత్యం డయాగ్నస్టిక్స్ ద్వారా మరో ఏడాది కొనసాగించేందుకు అనుమతి.
- కోవిడ్ ఓపీకి ఆక్సిజన్ పైప్‌లైన్ ఏర్పాటు.
- మహిళా ఉద్యోగులకు బాత్‌రూమ్‌ల ఏర్పాటు.
- ఏసీ నిర్వహణకు ఏడాది పాటు కాంట్రాక్ట్‌కు అనుమతి.
- ఫోరెన్సిక్ విభాగానికి రెండు బాడీ ఫ్రీజర్లు, 500 కేవీ సామర్థ్యమున్న జనరేటర్ కొనుగోలుకు ఆమోదం.
- సూపర్ స్పెషాలిటీలో మెకానికల్ ల్యాండ్రీ ఏర్పాటు.
- సూపర్ స్పెషాలిటీలో జనరిక్ మందుల షాపు ఏర్పాటుకు ఏపీఎంఎస్ఐడీసీ వారికి ఆదేశం.
- క్యాజువాలిటీ, ఏఎంసీ వార్డు విస్తరణకు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులకు ఆదేశాలు.

# అయ్యో... పాపం రైతన్న

- పంట రుణం రెన్యూవల్ కోసం వెళ్లి బ్యాంకు ఎదుటే గుండెపోటుతో మృతి


పుట్లూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద గుండె పోటుతో మృతి చెందిన బూసిరెడ్డి వెంకటరామిరెడ్డి

పుట్లూరు: పంటరుణం రెన్యూవల్ చేసుకునేందుకు బ్యాంకు వద్దకు వచ్చిన ఓ రైతన్న గుండె పోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన అనంతపురం జిల్లా పుట్లూరులో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...పుట్లూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలో పంట రుణాల రెన్యూవల్ కొన్నిరోజులుగా జరుగుతోంది. ఈ క్రమంలోనే మంగళవారం పుట్లూరు మండలం శనగలగూడూరు గ్రామానికి చెందిన రైతు బూసిరెడ్డి వెంకటరామిరెడ్డి(70) పంటరుణం రెన్యూవల్ చేసుకునేందుకు ఉదయమే పుట్లూరుకు వచ్చారు. రెన్యూవల్ కోసం కావాల్సిన పత్రాలను తీసుకుని ఉదయం 9 గంటలకు బ్యాంకు వద్ద వెళ్లగా, అప్పటికే అక్కడ 100 మంది రైతులు ఉన్నారు. దీంతో వెంకటరామిరెడ్డి క్యూలో నిరీక్షిస్తూ ఉండిపోయాడు. మధ్యాహ్నం 12.00 గంటల సమయంలో ఒక్కసారిగా వెంకటరామిరెడ్డి కుప్పకూలిపోయాడు. దీంతో మిగతా రైతులంతా ఆయనకు నీళ్లు తాగించేందుకు ప్రయత్నించినా ఎలాంటి స్పందన లేకపోవడంతో అతను మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**బ్యాంకు అధికారుల నిర్లక్ష్యమే కారణమా?**

వాస్తవానికి గడువుకు ఒకరోజు ముందు పంటరుణం రెన్యూవల్ చేసుకోవాలి. అప్పుడే ప్రభుత్వం నుంచి అందే పావలా వడ్డీ, ఇతర పథకాలు వర్తిస్తాయి. దీంతో రైతులు పంట రుణాల రెన్యూవల్ కోసం బ్యాంకుల ఎదుట క్యూ కడతారు. ఈ క్రమంలో చాలా బ్యాంకులు ఒక్కో గ్రామానికి ఒక్కోరోజు కేటాయించి రుణాలు రెవన్యూవల్ చేస్తుంటాయి. కానీ పుట్లూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో అలాంటి ప్రణాళిక లేకుండానే రెన్యూవల్ చేపట్టారు. పైగా జామీను తప్పనిసరి చేయడంతో ఒక్కోరైతు మరో రైతును వెంట తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే ఎండ తీవ్రత దృష్ట్యా బ్యాంకు ఆవరణలో నీరు, నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలంటున్నారు.

### పరారీలో డాక్టర్ లక్ష్మీకాంతమ్మ

అనంతపురం క్రైం: భ్రూణ హత్యకు కారకురాలైన డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తన వద్దకు చికిత్స కోసం వచ్చిన గర్భిణి కవిత (25)కు లింగనిర్ధారణ పరీక్ష చేసి, గర్భస్థ శిశువును ఆడపిల్లగా నిర్ధారించుకుని చేసిన అబార్షన్ వికటించి గర్భిణి మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు కావడంతో డాక్టర్ లక్ష్మీకాంతమ్మ పరారయ్యారు. కాగా, ఘటనకు సంబంధించి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ డెమో బృందం మంగళవారం ఉదయం అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో డాక్టర్ లక్ష్మీకాంతమ్మ నిర్వహిస్తున్న రూత్ ఆస్పత్రికి చేరుకున్నారు. డాక్టర్ లక్ష్మీకాంతమ్మ లేకపోవడంతో ఆమెకు డెమో భారతి ఫోన్ చేసి, ఘటనపై ఆరా తీశారు. తాను ఈ నెల 14నుంచి ఊళ్లో లేనని, రెండ్రోజుల తర్వాత వస్తానంటూ లక్ష్మీకాంతమ్మ పేర్కొనట్లు తెలిసింది. గర్భిణి మృతికి సంబంధించి ప్రశ్నిస్తే రెండ్రోజుల తర్వాత తానొచ్చి సమాధానమిస్తానని ఫోన్ పెట్టేసినట్లు సమాచారం. దీంతో డెమో సిబ్బంది వెనుదిరిగారు.

### ఆ సదస్సుతో సంబంధం లేదు

- ఏపీ రెవెన్యూ జేఏసీ స్పష్టీకరణ

అనంతపురం అర్బన్: అమరావతి జేఏసీ బుధవారం తలపెట్టిన ప్రాంతీయ సదస్సుతో తమకు సంబంధం లేదని ఏపీ రెవెన్యూ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఏపీ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.విజయభాస్కరరెడ్డి, కార్యదర్శి బి.పెద్దన్న, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు వై.మన్మథరెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.లక్ష్మయ్య మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీ అమరావతి జేఏసీ ప్రాంతీయ సదస్సుతో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, వీఆర్‌ఓ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన వారికి ఎలాంటి సంబంధం లేదన్నారు. తామంతా ఏపీ రెవెన్యూ జేఏసీలో కొనసాగుతున్నామన్నారు. కాబట్టి వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, ఎస్‌ఏలుగా పదోన్నతి పొందిన వీఆర్‌ఓలు ఈ సదస్సుకు హాజరు కాకూడదని సూచించారు. తమ జేఏసీలోని ఉద్యోగులను తహసీల్దారుల ద్వారా బెదిరించి సదస్సుకు హాజరయ్యేలా ఏపీ జేఏసీ అమరావతి నాయకులు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అలా బెదిరించే వారిపై కలెక్టర్, సీసీఎల్‌ఏకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

### ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల అహ్వానం

గుత్తి రూరల్: చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి గ్రూపులో ఎస్టీలకు 36, ఎస్సీలు, బీసీలు, ఓసీలు, ఏఈక్యూలకు ఒక్కో సీటు చొప్పున కేటాయిస్తారు. దరఖాస్తులను ఈ నెల 31లోపు www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దాఖలు చేయాలి. అనంతరం హార్డ్‌కాపీని సరైన ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రుల, విద్యార్థి ఆధార్ కార్డులు, తెల్లరేషన్ కార్డు నకళ్లు, నాలుగు ఫొటోలు, బ్యాంక్ పాస్‌బుక్కు జిరాక్స్ ప్రతులను నేరుగా సేవాగఢ్‌లోని గురుకుల పాఠశాలలో అందజేయాలి. పూర్తి సమాచారానికి 95426 55088లో సంప్రదించవచ్చు.

### చేనేతలకు ముద్ర రుణాలు

- చేనేత, జౌళి శాఖ ఏడీ అప్పాజీ

ఉరవకొండ: చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధికి ముద్ర రుణాలు మంజూరు చేయనున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ అప్పాజీ తెలిపారు. ముద్ర రుణాల మంజూరుపై చేనేతలకు మంగళవారం ఉరవకొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సొంత మగ్గం కలిగిన చేనేత కార్మికులు తమ ఖాతా ఉన్న బ్యాంకు ద్వారానే రూ.1.25 లక్షల రుణం పొందవచ్చునని, ఇందులో రూ.25 వేలు సబ్సిడీ పోను మిగిలిన మొత్తాన్ని 6 నుంచి 7 శాతం వడ్డీ రాయితీతో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రుణాల మంజూరుకు సంబంధించి బ్యాంకర్లకు శాఖా పరమైన సిఫారసు చేస్తామని భరోసానిచ్చారు. అనంతరం ఆసక్తి కనబరిచిన 105 మంది చేనేతలు ముద్ర రుణాల కోసం దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, చేనేత, జౌళి శాఖ ఏడీఓ నరసింహారెడ్డి, చేనేత సంఘం నాయకులు సాధు కుళ్లాయిస్వామి, కాసుల ఆంజనేయప్రసాద్, నిమ్మల వెంకటరమణ, గిద్దలూరు బ్రహ్మయ్య, బీరే శివ పాల్గొన్నారు.

### నూతన జాతీయ విద్యావిధానం సంపూర్ణంగా అమలు చేయాలి

అనంతపురం: నూతన జాతీయ విద్యావిధానం -2020లోని అంశాలు సంపూర్ణంగా అమలు చేయాలని జేఎన్‌టీయూ (ఏ) వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన అన్నారు. జేఎన్‌టీయూలోని పాలకభవనంలో మంగళవారం బీటెక్ కోర్సు రెగ్యులేషన్స్‌కు సంబంధించిన బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సదస్సులోఆయన మాట్లాడారు. మల్టీ పుల్ ఎగ్జిట్, మల్టీపుల్ ఎంట్రీ, మైనర్ డిగ్రీ, ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్, ఆనర్స్ డిగ్రీ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ వి.సుమలత, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు ఆచార్య ఈ.కేశవ రెడ్డి, ఆచార్య బి.ఈశ్వరరెడ్డి, ఆచార్య ఈ.అరుణ కాంతి, ఆచార్య వైశాలి, ఆచార్య బి.దుర్గాప్రసాద్, వేణుగోపాలరెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, ప్రొఫెసర్ సి.శోభాబిందు, ప్రొఫెసర్ ఆర్.భవాని, ప్రొఫెసర్ వీబీ చిత్ర పాల్గొన్నారు.



# 'సచివాలయం'.. దేశానికే ఆదర్శం

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

రాప్తాడు: ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జిల్లా అధికారులతో కలసి రాప్తాడు మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత ప్రసన్నాయపల్లి పంచాయతీలో గ్రామీణ ఉపాధి పనులు పరిశీలించి, ఉపాధి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనుల కల్పనలో అలసత్వం వీడాలన్నారు. 100 రోజులు పనులు పూర్తి చేసిన వారికి 150 పని దినాలకు పెంచాలని కూలీలు అడగడంతో విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం రాప్తాడు చెరువులో చేపల పెంపకాన్ని, రామినేపల్లిలో ఉద్యాన తోటలు, పట్టు పురుగుల పెంపకాన్ని, చెత్తతో సంపద తయారీ కేంద్రాలు, జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పరిశీలించారు. హంపాపురం, రాప్తాడు, బొమ్మేపర్తి సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి, సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో వేసిన సీసీ రోడ్లు, జల జీవన్ మిషన్ పనులు పరిశీలించారు. సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వారధిలా పని చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి, సీఈఓ భాస్కరరెడ్డి, ఏపీడీ అనూరాధ, డీఎల్‌డీఓ ఓబులమ్మ, తహసీల్దార్ లక్ష్మీనరసింహులు, ఎంపీడీఓ సాల్మన్, ఏపీఓ రామకృష్ణ రెడ్డి, హసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజినేయులు, మన్నల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ గౌతమిని కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు.

### చంద్రబాబుకు జైలు తప్పదు

- వైఎస్సార్ సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం క్రైం: అమరావతి భూ కుంభ కోణంలో క్విడ్‌ప్రోకు పాల్పడ్డ మాజీ సీఎం చంద్రబాబుకు జైలు శిక్ష ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమరావతి భూ కుంభ కోణంలో చంద్రబాబు పాత్ర ఉందని సీఐడీ అధికారులు నిగ్గు తేల్చారన్నారు. యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడాన్ని అడ్డుకోలేరన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో వర్గకక్షలు వీడి గ్రామాల్లో ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. ఈ క్రమంలో రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, ఎగ్గుల శ్రీనివాసులు, శ్రీదేవి, ఎస్సీ సెల్ సీనియర్ నేత పెన్నోబులేసు, తదితరులు పాల్గొన్నారు.

### ఆటో బోల్తా - వివాహిత దుర్మరణం


సునీత (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని గౌనిగుంట క్రాస్ వద్ద మంగళవారం ఆటో బోల్తా పడిన ఘటనలో వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం తల్లిమడుగుల గ్రామానికి చెందిన ఈడిగ సునీత (30) తన భర్త వన్నూరు స్వామితో కలసి వారం రోజుల క్రితం గుమ్మఘట్ట మండలం తాళ్లకెరలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ప్యాసింజర్ ఆటోలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో గౌనిగుంట క్రాస్ వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తాపడింది. ఘటనలో సునీత అక్కడికక్కడే మృతి చెందింది. వన్నూరుస్వామి, డిజిటల్ అసిస్టెంట్ సలీన గాయపడ్డారు. మృతురాలికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# వారసత్వం పొందితే సొమ్ము చెల్లించాల్సిందే

అనంతపురం: వారసత్వ హక్కు పొందితే బేషరతుగా సొమ్ము చెల్లించాల్సిందేనని జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్‌పర్సన్ ఎం. శ్రీలత మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. అనంతపురానికి చెందిన చంద్రశేఖర్.. 2018, జనవరి 18న మరణించారు. ఆయన పేరున ఉన్న ఎస్‌బీఐ ఖాతాలో రూ.28 లక్షలకు వివాహితైన కుమార్తె నాగమణి తప్ప ఇతర వారసులు ఎవరూ లేరు. ఈ నేపథ్యంలో నాగమణి అప్పట్లో బ్యాంక్ అధికారులను కలసి తన తండ్రి పేరున బ్యాంక్ ఖాతాలో ఉన్న మొత్తాన్ని చెల్లించాలని కోరారు. ఇందుకు బ్యాంక్ అధికారులు సమ్మతించకపోవడంతో ఆమె జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై చంద్రశేఖర్‌కు తానే భార్యనంటూ అన్ని దాఖలాలు సమర్పించిన అశ్వత్థమ్మ అనే మహిళకు ఆయన ఖాతాలోని మొత్తాన్ని చెల్లించినట్లు బ్యాంక్ అధికారులు వివరణ ఇచ్చారు. అంతేకాక నాగమణికి మూడేళ్ల వయసున్నప్పుడే బిడ్డను పిలుచుకుని చంద్రశేఖర్ భార్య నాగలక్ష్మి ఇల్లు వదిలి వెళ్లిపోయిందని, అప్పటి నుంచి ఖాతాకు నామినీగా ఎవరి పేరు లేదని పేర్కొన్నారు. అయితే తాను బ్యాంక్ అధికారులను సంప్రదించిన తర్వాత వారు కోరిన ప్రతి పత్రాన్ని అధికారికంగా తీసుకుని అందజేసినట్లు నాగమణి వాదనలు వినిపించారు. వారసత్వ హక్కు పత్రాన్ని 2019 మే 13న అందజేసినప్పటికీ తనను బ్యాంక్ చుట్టూ తిప్పుకున్నారని వాపోయారు. దీనిపై కమిషన్ స్పందించింది. వారసత్వ పత్రం పొందిన వారికి కాకుండా ఇతరులకు సొమ్ము చెల్లించడం భావ్యం కాదని పేర్కొంటూ చంద్రశేఖర్ కుమార్తెకు అతని పేరున బ్యాంక్‌లో ఉన్న నగదు మొత్తం వారసత్వ పత్రం అందజేసినప్పటి నుంచి 6 శాతం వడ్డీతో నెలలోపు చెల్లించాలని, మనోవేదనకు గురి చేసినందుకు రూ.30 వేలు, సేవాలోపానికి రూ.20 వేలు, ఖర్చులకు రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.55వేలు పరిహారాన్ని చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలత, సభ్యులు డి.గ్రేస్ మేరీ, బి. గోపీనాథ్‌ల ధర్మాసనం తీర్పు వెలువరించింది.

# ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం

అనంతపురం: పారిశ్రామిక రంగంలోకి ప్రవేశించేందుకు ఆసక్తి చూపే మహిళలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి అన్నారు. పరిశ్రమల ఏర్పాటు అంశానికి సంబంధించి బుక్కరాయసముద్రం, పామిడి, కళ్యాణదుర్గం, ఉరవకొండ క్లస్టర్ల ఏపీఎంఎస్, సీసీలకు మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి డీఆర్‌డీఏ పీడీ అధ్యక్షత వహించి, మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల్లోని ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.10 లక్షల వరకూ ఎలాంటి పూచీ లేకుండా రుణాలు అందజేస్తామన్నారు. పీఎంఈజీపీ, ముద్ర, స్టాండప్- ఇండియా, శ్రీనిధి, ఉన్నతి పథకాలపై మహిళలను చైతన్యపరచాలని సూచించారు.